క్లుప్తంగా

అసోం, నాగాలాండ్‌లో డాక్టర్ నిశాంత్ వైద్య సేవలు



గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన ప్రఖ్యాత ప్లాస్టిక్, కాస్మొటిక్ సర్జన్ డాక్టర్ నిశాంత్ సాధనాల గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. సెప్టెంబరు మొదటి వారంలో అసోం – నాగాలాండ్ సరిహద్దులోని 15 మంది చిన్నారులకు రోగులకు ఉచిత శస్త్రచికిత్సలు విజయవంతంగా చేశారు. సేవా యాత్ర ముగించుకుని శుక్రవారం గుంటూరు వచ్చిన డాక్టర్ నిశాంత్ సాధనాల మీడియాతో మాట్లాడారు. గ్రహణం మొర్రి, చీలిక పెదవి సమస్యలతో బాధపడుతున్న పిల్లలు, కాలిన గాయాల కారణంగా వికృత రూపాలకు గురైన గిరిజన ప్రాంత బాధితులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేశామన్నారు. జీవన రేఖ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ 'జీవన రేఖ ఎక్స్‌ప్రెస్' వంటి పథకాల ద్వారా వీరికి చక్కని వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు.

వరద బాధితులకు ఒలీవ స్కూల్ వితరణ



గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం నెహ్రూనగర్లోని ఒలీవ స్కూల్ ఆధ్వర్యంలో మూడువేల మందికి ఆహారం, వెయ్యి పాల ప్యాకెట్లు, తాగునీటిని పంపించారు. శుక్రవారం పాఠశాల యాజమాన్యంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు సంయుక్తంగా వరద బాధితులను ఆదుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఒలీవ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ నక్కా జార్జిబాబు పర్యవేక్షించారు.

కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు నల్లబ్యాడ్జిలు ధరించి శుక్రవారం విధులు బహిష్కరించారు. సర్దుబాటు కోసం విడుదల చేసిన జీఓ నంబరు 115 నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో నర్సెస్ స్ట్రగుల్ కమిటీ నేతలు స్వచ్ఛంద ప్రసాద్, పి.మనీష, బి.శివమ్మ, వి.విజయ్‌కుమార్, హైమావతి, కుసుమకుమారి, కరుణ పాల్గొన్నారు. నాట్కో క్యాన్సర్ సెంటర్‌లోని నర్సింగ్ కార్యాలయం అధికారులు తమను బెదిరించినట్లు కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది వాపోయారు.

ఐక్యవేదిక మద్దతు..

గుంటూరు జీజీహెచ్‌లో కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు చేస్తున్న ఆందోళనకు జిల్లా ఐక్యవేదిక నేతలు మద్దతు తెలిపింది. ఐక్యవేదిక జిల్లా చైర్మన్ చాంద్ బాషా, పలువురు నేతలు జీజీహెచ్‌కు విచ్చేసి కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శివారెడ్డి, నగరశాఖ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లాషాఖాదిరి, జిల్లా మహిళా అధ్యక్షురాలు హేమలత, సంయుక్త కార్యదర్శి షబానా సుల్తానా, అరుణకుమారి, విజ యబాబు, రత్తయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బెలూన్ చికిత్సతో అధిక బరువుకు చెక్

డాక్టర్ అళ్ల సిద్ధార్థరెడ్డి



గుంటూరు మెడికల్: బెలూన్ చికిత్సతో అధిక బరువుకు చెక్ పెట్టవచ్చని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, సిద్ధార్థ గ్యాస్ట్రో కేర్ హాస్పటల్ అధినేత డాక్టర్ అళ్ల సిద్ధార్థరెడ్డి చెప్పారు. కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని హాస్పిటల్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో నూతన చికిత్స విధానం గురించి ఆయన వివరించారు. నిత్యం రోగులతో బిజీగా ఉండే ఓ డాక్టర్ సుమారు 110 కిలోల బరువుతో బాధపడుతూ తగ్గేందుకు చికిత్స కోసం ఇటీవల తన వద్దకు వచ్చారని తెలిపారు. ఇన్‌ట్రా గ్యాస్ట్రిక్ బెలూన్ – స్పాడ్జ్ –3 చికిత్స విధానంలో వైద్యుడికి కడుపులో బెలూన్ అమర్చామని చెప్పారు. మిథలిన్ బ్లూతో కలిపిన డిస్టల్ వాటర్‌ను బెలూన్‌లో నింపి ఎలాంటి కోత, కుట్లు లేకుండా ఎండోస్కోపి ద్వారా కడుపులో పెట్టామని పేర్కొన్నారు. బెలూన్ పెట్టిన నెలరోజుల వ్యవధిలో పది కిలోల బరువు వైద్యుడు తగ్గినట్లు వెల్లడించారు. దీంతో మరికొంత బరువు తగ్గించే ప్రయత్నంలో భాగంగా బుధవారం వైద్యుడికి బెలూన్ వాల్యూమ్ సరిచేసి లిక్విడ్‌ను ఎక్కువ మొత్తంలో నింపి తిరిగి కడుపులో బెలూన్ పెట్టామని తెలిపారు. ఈ చికిత్స చేసేందుకు కేవలం పది నిమిషాలు మాత్రమే పడుతుందని వివరించారు. ఆపరేషన్ల అనంతరం అకస్మాత్తుగా బరువు పెరిగే వారికి బెలూన్ చికిత్స ఎంతో ఉపయోగపడుతుందని, త్వరితగతిన బరువు తగ్గవచ్చని చెప్పారు. బరువు తగ్గిన కొన్నాళ్లకు బెలూన్ తీసివేయచ్చని తెలిపారు. గుంటూరులో మొట్టమొదటిసారిగా తమ హాస్పిటల్‌లో బరువు తగ్గాలనుకునేవారి కోసం నూతన చికిత్స విధానం అందుబాటులోకి తీసుకొచ్చామని డాక్టర్ అళ్ల సిద్ధార్థరెడ్డి చెప్పారు.

• అధినాయకా.. వినాయకా..



అధినాయకుడు వినాయకుడి సంబరం వచ్చేసింది. నగరమంతా సందడి నెలకొంది. వరద ప్రభావం ఉన్నప్పటికీ వినాయకుడికి ఆదరణ తగ్గలేదు. గణేశుని పూజకు అవసరమైన పత్రి కొనుగోలు కోసం ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారు. మట్టి ప్రతిమలు మార్కెట్‌లో కొలువు దీరాయి. పూలు, పండ్లకు గిరాకీ పెరిగింది. గుంటూరు మార్కెట్ సెంటర్‌లో సందడి నెలకొంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు









అంకితభావంతో పనిచేయాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూ నగర్: వరద ప్రభావిత ప్రాంతాల చేపట్టిన సహాయక చర్యల్లో సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాలని, సిబ్బందికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటామని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. విజయవాడ నగరంలోని 62వ డివిజన్ లోని ఎల్బీఎస్ నగర్, పటేల్ నగర్, లక్ష్మీనగర్, ప్రకాష్ నగర్ మెయిన్ రోడ్, రాదా నగర్ తదితర ప్రాంతాల్లో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మట్టి గణపతే మహా గణపతి అని ప్రతి ఒక్కరూ పర్యావరణహిత వినాయక చవితి వేడుకలకు జరుపుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.



సిబ్బందికి తగు సూచనలు చేస్తున్న గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

బజరంగ్ ఆధ్వర్యంలో ఏడు వేల మట్టి ప్రతిమల పంపిణీ

కొరిటిపాడు: మట్టి వినాయకుడిని పూజించి ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ముందడుగు వేద్దామని బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా సి.ఈ.ఓ. అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. మట్టి వినాయకుడిని పూజిద్దాం అనే నినాదంతో బజరంగ్ అర్బన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు నగరం పట్టాభిపురంలో ఆరు వేలు ప్రతిమలు, పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామంలో వెయ్యి ప్రతిమలను పంపిణీ చేశారు. బజరంగ్ సి.ఈ.ఓ. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినానికి ప్రకృతికి అవినాభావ సంబంధం ఉందని, దాన్ని మన పూర్వీకులు వేల సంవత్సరాల క్రితమే ఆచారంగా అందించారని తెలిపారు. ప్రజలంతా మట్టి గణపతి ప్రతిమను పూజించడం ద్వారా పండుగ మరింత శోభాయమానంగా విరాజిల్లుతుందని చెప్పారు. మూడేళ్లగా మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో బజరంగ్ డైరెక్టర్లు సిద్ధినేని శ్రీనివాసరావు, సమీర్ నందన్, జి.సుబ్బారా వు, ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



మట్టి వినాయకుడి ప్రతిమలను పంపిణీ చేస్తున్న బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా సీఈఓ అంబటి మురళీకృష్ణ

గోసంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటాం: మేయర్



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ కావటి

గుంటూరు రూరల్: వెంగళాయపాలెంలోని నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణశాలను నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు శుక్రవార ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా గోవులు తీవ్ర ఇబ్బంది పడుతున్నాయని, వాటికి ఆహారం కూడా సరిగా అందటంలేదని ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో గో సంరక్షణ, గో ప్రేమికులు, నగరపాలకసంస్థ అధికారులతో కలసి మేయర్ పరిశీలించారు.

గో ప్రేమికులతో చర్చించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గోవులు ఇబ్బంది పడుతున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అధికారులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే గోశాలను రోబో యంత్రంతో శుభ్రం చేయించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గోవులను వివిధ ప్రాంతాల నుంచి వేరొక ప్రాంతాలకు అనధికారికంగా తరలిస్తున్న వాహనాలను గోసంరక్షణ సభ్యులు పోలీసులు పట్టుకుని, వాటిలో ఉన్న గోవులను నగరపాలకసంస్థ గోసంరక్షణకు తరలించుట వలన గోవుల సంఖ్య పెరిగాయన్నారు. నగర పాలక సంస్థ అధికారులు గోవుల సంరక్షణలో నిర్లక్ష్యం వహించడం తగదని హితవుపలికారు. గోవుల సంఖ్య ఎక్కువగా ఉండుటం వల్ల గో సంరక్షణశాల చుట్టుపక్కల ఖాళీ స్థలంలో ఫెన్సింగ్ వేసి వాటిని బయటకి వదలాలన్నారు. గో సంరక్షకులుగాని, గోవులను పెంచుకోదలచుకున్న వారికి నిబంధనల ప్రకారం గోవులను అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గో సంరక్షణ ప్రేమికులు సిహెచ్.రాజు, ఆర్.కోటేశ్వర రావు, జి.మనోహర్, ఎస్. మనోహర్ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని 25వ డివిజన్ కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి పేర్కొన్నారు. శుక్రవారం జోసఫ్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థులకు స్వయంగా ఆహారాన్ని వడ్డించారు.

మట్టి వినాయకుని ప్రతిమలనే పూజిద్దాం



చిన్నారులకు మట్టి ప్రతిమలను అందజేస్తున్న తులసి ధర్మచరణ్

వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్

కొరిటిపాడు: ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణాన్ని పరిరక్షించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మట్టి గణపతిని పూజించి, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ అన్నారు. స్థానిక అమరావతి మెయిన్ రోడ్ లో ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమానికి ధర్మచరణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ధర్మచరణ్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుదామన్నారు. కార్యక్రమంలో ఓలేటి అరవింద్, మైలవరపు చంద్ర, గుళ్ళపల్లి కుమార్, కోటగిరి అనిల్, గాజుల సాయిరాం, ఆది, శంకర్, అయ్యప్ప, సుబ్బు, కిరణ్ పాల్గొన్నారు.

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ సహిత మట్టి వినాయకుని ప్రతిమలనే పూజించాలని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం జేకేసీ కళాశాలరోడ్డులోని పాఠశాలలో ముందస్తు వినాయకచవితి వేడుకలను నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి. రత్తయ్య ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం గుజ్జనగుండ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కె.బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు.

యూనిసెఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో

గుంటూరు ఎడ్యుకేషన్: వినాయకచవితిని ప్రకృతిహితంగా జరుపుకోవాలని యూనిసెఫ్ స్వచ్ఛంద సభ్యురాలు బి.రోజారాణి తెలిపారు. మారుతినగర్‌లోని యాపిల్ స్కూల్లో శుక్రవారం పర్యావరణ మట్టి గణపతి వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బి.పేరిరెడ్డి, ఇన్‌చార్జి ఎస్.శ్రీలక్ష్మి, ఏఓ పి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మట్టి వినాయకుని ప్రతిమలను పంపిణీ చేస్తున్న కేఎల్పీ స్కూల్ ప్రిన్సిపాల్ రత్తయ్య



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. లక్ష్మీపురంలో ఆనం మెడికల్ హబ్ వద్ద గుంటూరు జిల్లా ల్యాబ్ అండ్ ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాడేకోరు శ్రీహరిబాబు, నగర అధ్యక్షుడు గ్లోబల్ లక్ష్మణ్, నేషనల్ ఎక్సరే కృష్ణ, సూర్య ల్యాబ్ శ్రీనివాస్, ఎస్ఎస్ రమణ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సీతారామయ్య స్కూల్లో..

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో వినాయకచవితి వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులు శివపార్వతులు, విఘ్నేశ్వరుని వేషధారణలో గణనాథుని జన్మ వృత్తాంతాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. మట్టి వినాయకుని ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో–ఆర్డినేటర్లు శ్రీదేవి, దుర్గాశ్యామ్ పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం

గుంటూరు ఎడ్యుకేషన్: మట్టి గణపతిని పూజించడం ద్వారా పర్యావరణానికి పరిరక్షించుదామని కెనడీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ డైరెక్టర్ కె.శ్రీకాంత్‌బాబు పేర్కొన్నారు. అరండల్‌పేట మూడోలైనులోని కెనడీ స్కూల్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుని ప్రతిమలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీవిద్య, ప్రిన్సిపాల్ ఐజాక్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య పాల్గొన్నారు.

వీవా–వీవీఐటీ ఆధ్వర్యంలో..

గుంటూరు ఎడ్యుకేషన్: నవభారత్‌నగర్‌లోని వీవా స్కూల్ సిటీ క్యాంపస్ వద్ద శుక్రవారం వీవా – వీవీఐటీ విద్యాసంస్థల విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు.

● బ్రాడీపేటలోని బీహెచ్ మహిళా కళాశాలలో పర్యావరణ హిత వినాయకుని విశిష్టతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థినులు మట్టితో గణపతి విగ్రహాలను తయారు చేశారు. పూజ విధానాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కౌసల్యాదేవి వివరించారు.



యూనిసెఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలు తయారీ



శివపార్వతులు, గణనాథుని వేషధారణలోని విద్యార్థులతో విష్ణువర్ధన్ తదితరులు



మట్టి వినాయకుని ప్రతిమలతో కెనడీ స్కూల్ విద్యార్థుల ర్యాలీ



వీవా–వీవీఐటీలో విద్యార్థులు తయారు చేసిన ప్రతిమల పంపిణీ

వరద బాధితులను ఆదుకోవాలి

లక్ష్మీపురం: వరదలకు నష్టపోయిన నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు లక్ష ఎకరాలలో పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఉద్యాన పంటలకు ఎకరాకు లక్ష రూపాయలు, వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఎన్నికల్లో ఎకరాకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసరాలు ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు వై.నేతాజి, ఈమని అప్పారావు, కె.నళీకాంత్, బెర్రగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.